క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి వెంకురెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాల 2012–2014 విద్యా సంవత్సర పూర్వ విద్యార్థులు సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం ఆ కళాశాల ఆవరణలో కలిసి సందడి చేశారు. ఆ కళాశాలలో చదివే సమయంలో చేసిన అల్లరిని, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్ర, అధ్యాపకులు అంజాద్, ఇంతియాజ్, వెంకటస్వామి, భారతి, మంజుల, నిర్వాహకులు గౌతమ్, అనిల్, రషీద్, రఫి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ



కావలిరూరల్: కనుమ పండగ సందర్భంగా సోమవారం పట్టణంలోని డాక్టర్ డీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో పేద వృద్ధులకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. కావలిలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ డీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్మన్ దొడ్ల ఆదిలక్ష్మి, దొడ్ల విశాల్, ఆశ్రిత, శీతల్, నవనీత్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో గోపూజ



గోపూజ నిర్వహిస్తున్న అర్చకుడు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయంలో సోమవారం కనుమ పండగ సందర్భంగా ఆలయ సిబ్బంది గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవును ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. గోవుకు భక్తులు పండ్లు, ఫలహారాలు తినిపించారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు బెల్లంకొండ పెదభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఉత్సవం



సీతారాములకు ప్రత్యేక అలంకరణ

మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం ఎగువూరు యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

దుస్తుల పంపిణీ



కావలిరూరల్: కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ మార్కండేయపురం గిరిజనకాలనీలో సోమవారం న్యాయవాది ఐ.సాయిప్రసాద్ పేద గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది బాబురావు, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జ పూజ మహోత్సవం



ఉత్సాహంగా పండరి భజన వేస్తున్న చిన్నారులు

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడి గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం రాత్రి పండరి భజన గురువులు విశ్వరూపం, టి.రమణయ్య చిన్నారులకు గజ్జ పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల రోజుల నుంచి గురువుల వద్ద భజన నేర్చుకున్న చిన్నారులు గజ్జలు కట్టి, ఉపవాస దీక్షతో చేసిన పండరి భజన, భక్తిగీతాలు అలరించాయి.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

- పెద్ద పండగను ఉత్సాహంగా జరుపుకున్న ప్రజలు
- కావలిలో కళుగోళమ్మకు వేడుకగా గ్రామోత్సవం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కనుమ సందర్భంగా పశువులను పూజించిన రైతులు
- స్వగ్రామాలకు వచ్చిన వారితో సందడిగా పల్లెలు



కావలిలో కళుగోళమ్మ శాంభవి అమ్మవారి గ్రామోత్సవం



కావలి: విద్యుద్దీపకాంతుల్లో వెలిగిపోతున్న కళుగోళమ్మ, శాంభవి అమ్మవారి ఆలయం



సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న సతీష్‌రెడ్డి దంపతులు



కావలి: ఉత్సవాల్లో ప్రదర్శిస్తున్న ఆచారాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి

కావలి: సంక్రాంతి పండగను ఆదివారం కావలి నియోజకవర్గ ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కావలిలో నిర్వహించిన గ్రామదేవత కళుగోళమ్మ శాంభవి అమ్మవారి గ్రామోత్సవంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల నేపథ్యంలో పట్టణంలోని సినిమా హాలు రోడ్డు విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల కటౌట్లతో నిండిపోయింది. స్థానిక వడ్డిపాళేనికి చెందిన ఫ్రెడ్లీ యూత్, స్నేహ యూత్ కమిటీ సినిమా, టీవీ కళాకారులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళుగోళమ్మ శాంభవి అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం రాత్రి ప్రారంభమై సోమవారం సాయంత్రం వరకు కొనసాగింది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి – ఆదిలక్ష్మి దంపతులు, వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి కావలి పట్టణంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

ఆలయాల్లో సతీష్‌రెడ్డి పూజలు

ఆత్మకూరురూరల్: సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం మండలంలోని మహిమలూరులో రక్షణశాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సత్యభామా రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, వెంకయ్యస్వామి ఆలయాలు, రామాలయం, పోలేరమ్మ గుడి తదితర ఆలయాల్లో కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు, సంగం సీఐలు నాగేశ్వరరావు, రవినాయక్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కవితమ్మ, మాజీ సర్పంచ్‌లు సానా వేణుగోపాల్‌రెడ్డి, యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి తదితరులు సతీష్‌రెడ్డి దంపతులను సన్మానించారు.

సంప్రదాయబద్ధంగా వేడుకలు

జలదంకి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. నూతన దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు రంగవల్లుల పోటీల్లో పాల్గొని అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్రామాల్లో ఆటలు, క్రికెట్, కబడ్డీ, సైక్లింగ్, మొకులాగడం, ట్రాక్టర్ రివర్స్ తదితర పోటీలు నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం కనుమ పండగ సందర్భంగా ఆవులు, గేదెలు, ఎడ్ల కొమ్ములకు రంగులు వేసి పూజించారు. పోలేరమ్మతల్లి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకగా కొండతిరుగుడు ఉత్సవం



సంగమేశ్వరుని ఊరేగింపు

సంగం: మండల కేంద్రమైన సంగంలో కొలువైన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి కొండ తిరుగుడు ఉత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఏటా సంక్రాంతి సందర్భంగా సంగమేశ్వరస్వామి కొండతిరుగుడు ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా తొలుత కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శివాలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండతిరుగుడు ఉత్సవాన్ని ప్రారంభించారు. కొరిమెర్ల, తలుపూరుపాడు, తరుణవాయి గ్రామాల్లో రెండ్రోజుల పాటు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై నాగార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడలతో యువతకు భవిత



క్రికెట్ పోటీల విజేత ఈగల్ జట్టుకు కప్ అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెక్కా వెంకయ్య క్రీడా ప్రాంగణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ పోటీల్లో విజేతలకు సోమవారం రాత్రి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ వైద్యులు షకీల, జె.ప్రణీత్ హాజరయ్యారు. కాగా క్రికెట్‌లో 11 ఇడియట్స్ జట్టు రన్నర్‌గా నిలవగా ఈగల్ జట్టు విజేతగా నిలిచింది. బాలికలకు పరుగుపందేలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్రీడాకారులకు వ్యక్తిగత మెమెంటోలతోపాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, సీపీఎం, సీఐటీయూ నాయకులు నందా శ్రీనివాసులు, డేవిడ్‌రాజు, ఎస్‌కే సందానీ, జిలానీబాషా, ఎస్.శ్రీనివాసులు, సాదిక్ హుస్సేన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదికి నీరు విడుదల చేయండి

ఆత్మకూరు: సోమశిల జలాశయం నుంచి పెన్నానది దిగువకు(ఉత్తర, దక్షిణ కాలువలకు కాకుండా) క్రమబద్ధంగా నీరు విడుదల చేయాలని ఆత్మకూరు, చేజర్ల మండలాల పలు గ్రామాలకు చెందిన రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు చేజర్లకు చెందిన పలువురు రైతులు సోమవారం ఆత్మకూరు ఇరిగేషన్ కార్యాలయం వద్దకు అధికారులతో మాట్లాడేందుకు వచ్చారు. అయితే సెలవుదినం కావడంతో అధికారులు అందుబాటులో లేరు. ఈ విషయమై జలాశయం డీఈఈ రవీంద్రప్రసాద్‌ను సంప్రదించగా సంగం బ్యారేజ్, కావలి కాలువ ఆయకట్టు రైతుల అవసరాల మేరకు సంబంధిత అధికారులు ఇండెంట్ చెబుతారని, ఆ మేరకు పెన్నానది దిగువకు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో రైతుల సమస్య అర్థమైందని అయినా ఆయకట్టు రైతుల అవసరాల అనంతరమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

యువత రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత



రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

మర్రిపాడు: మండలంలోని తిక్కవరం గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన ఇనకుర్తి నాగార్జున జ్ఞాపకార్థం వైఎస్సార్‌సీపీ నాయకులు, యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగవరపు శ్రీనివాసులు నాయుడు ప్రారంభించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రా నారాయణస్వామి, పొంగూరు సుధాకర్, నాగేశ్వరరావు, రమేష్, సుధాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జలదంకి: మండలంలోని ఎల్ఆర్ అగ్రహారంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం తాగేటివారిపాళెంలో పరుసు కిషోర్‌కు చెందిన పూరి గుడిసె అగ్ని ప్రమాదంలో దగ్ధమైనట్లు తెలుసుకుని కాకర్ల ట్రస్ట్ తరఫున రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గాలి శ్రీనివాసులు, గొట్టిపాటి మురళి, బెల్లం మధు, తలపనేని కేశవప్రసాద్, దావులూరి మధు, గాలి మధు, కొత్రిపాటి రామారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అప్పసముద్రంలో..

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం గ్రామంలో రెడ్‌క్రాస్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని సుమారు 45 మంది యువకులు రక్తదానం చేశారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండగ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా యువతను గ్రామస్తులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ధర్మపల్లెమ్మ ఉత్సవం



సోమశిల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులో వెలసిన ధర్మపల్లెమ్మకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎద్దుల శ్రీనివాసులురెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



సోమశిల: డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కుటుంబసభ్యులు సంక్రాంతి పర్వదినం సందర్భంగా వారి స్వగ్రామమైన అనంతసాగరం మండలం లింగంగుంటలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెట్టుకూరు విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

సంగం: మండలంలోని వంగల్లు గ్రామంలో పేకాట స్థావరాలపై ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంలో గేదెలు మృతి

దగదర్తి(కావలి): దగదర్తి మండలం ఉలవపాళ్లలో విద్యుత్ స్తంభం విరిగి హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగి మూడు గేదెలపై పడడంతో అవి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత పాడిరైతులు గోళ్ల యానాదమ్మ, గోళ్ల నాగేశ్వరి తమ గేదెలను మేత కోసం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోకి తోలుకెళ్లారు. గేదెలు మేత మేస్తున్న సమయంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండే స్తంభం విరిగి తీగలు గేదెలపై పడడంతో యానాదమ్మకు చెందిన ఒక గేదె, నాగేశ్వరికి చెందిన రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. అక్కడే గేదెలు మేపుతున్న యానదమ్మ, నాగేశ్వరి ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. కనుమ పండగ రోజే జీవనాధారమైన గేదెలను కోల్పోవడంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. గేదెల విలువ రూ.1.50 లక్షల పైనే ఉంటుందని బాధితులు తెలిపారు.

కోటేశ్వరస్వామికి గ్రామోత్సవం

సంగం: సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం మండలంలోని దువ్వూరులో వెలసిన గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అశ్వవాహనంపై ఉంచి విశేషంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బీఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు స్థలం ఎంపిక

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గం నుంచి మూడుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కే.శే.బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. వైఎస్సార్‌సీపీ, సీపీఎం, టీడీపీ తదితర రాజకీయ పార్టీలతో ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్ బి.రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానంతరం బీఎస్సార్ సెంటర్‌లో విగ్రహం ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. మెయిన్, హిల్‌రోడ్డుకు వెళ్లే కార్నర్ ప్రాంతం అనువుగా ఉంటుందని ఏకగ్రీవంగా నిర్ణయించారు. అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, చల్లా రవి, ఐవీ రమణారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎ.నాగయ్య, ఎల్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేబు క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరురూరల్: అఖిల భారత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరులో తపాలాశాఖ జేబు క్యాలెండర్ ఆవిష్కరణను సోమవారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్, పి4 కార్యదర్శి సీహెచ్ వెంకయ్య, సంఘం నాయకులు ఎం.రాఘవయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న జేవీవీ నాయకులు

వరికుంటపాడు: మండలంలోని కొండాయపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం జనవిజ్ఞాన వేదిక మండలశాఖ ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకుడు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతో జేవీవీ ప్రతి ఏడాది పోటీలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.మాలకొండయ్య, జేవీవీ నాయకులు పీఎం చలం, డీవీ రమణ, సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, చెన్నకేశవులు, రమణయ్య, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాకొల్లువారిపల్లెలో మాధవరపు నాగేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతి ప్రదానం



గుండెమడకలలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



అనుమసముద్రంపేట: బహుమతులు అందజేస్తున్న ఎస్సై నరేష్

వింజమూరు: మండలంలో ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండగలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటి ముంగిళ్లలో ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. పూర్వీకులను స్మరించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ రోజు పశువులను పూజించి వాటిని రంగులతో అలంకరించారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అనుమసముద్రంలో..

అనుమసముద్రంపేట: కనుమ పండగను పురస్కరించుకుని సోమవారం అనుమసముద్రంలో స్థానిక యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు స్థానిక ఎస్సై నరేష్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన పాముూరు సునంద, గంధం శ్రావణి, ఆవుల నివేదికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, సరీఫ్, నరసింహ, సుకుమార్, జైకుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరిలో సంబరాలు



కలిగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కనుమ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో రైతులు పశువులను పూజించారు. కలిగిరిలో నిర్వహించిన సంక్రాంతి క్రీడా పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు చెంచుకృష్ణారెడ్డి, అశోక్ బహుమతులు పంపిణీ చేశారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుకలు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుకగా నిత్యావసర సరుకులు అందజేశారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు స్థానిక కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి చేతులమీదుగా సంక్రాంతి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఒంటేరు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సలహాదారు ఎల్‌కే ప్రసాద్, నెహేమియా, హజరత్‌రెడ్డి, శకుంతల, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఆర్ మెమోరియల్ టోర్నమెంట్

చేజర్ల: మండలంలోని గొల్లపల్లి మైదానంలో నిర్వహిస్తున్న ఎంజీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం చేజర్ల రెడ్డీస్ జట్టు, చేజర్ల చాలెంజర్స్ జట్టు తలపడగా చేజర్ల రెడ్డీస్ జట్టు విజయం సాధించింది. చేజర్ల రెడ్డీస్ జట్టు, నాగులవెలటూరు, చిత్తలూరు జట్టు సెమీస్‌కు చేరాయి.

విజేత మిడల్ స్ట్రీట్ మిరాకిల్స్



షీల్డ్ అందుకుంటున్న క్రికెట్ పోటీల విజేతలు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన చిట్టమూరు రవీంద్రనాథ్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మిడిల్ స్ట్రీట్ మిరాకిల్స్ జట్టు విజేతగా నిలిచింది. మొత్తం మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో 11 జట్లు పాల్గొనగా, రెండో స్థానంలో బెస్తరాజుల జట్టు నిలిచింది. విజేతలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి విజేత జట్టుకు రూ.10,116, రన్నర్ జట్టుకు రూ.5,116 నగదు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు.

క్రీడాకారులకు బహుమతుల అందజేత



కంపసముద్రంలో బహుమతులు అందజేస్తున్న నాయకులు

మర్రిపాడు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్, షార్ట్‌పుట్, బ్యాడ్మింటన్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆది, సోమవారాల్లో నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మర్రిపాడులో వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు సర్పంచ్ బీబీజాన్, ఉపాధ్యాయులు మోహన్ ప్రసాద్, నాయబ్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కంపసముద్రంలో మల్లు శ్రీనివాసులురెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. తిక్కవరంలో ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, చంద్రా నారాయణస్వాములు బహుమతులు అందజేశారు.

క్రికెట్ పోటీల విజేత వింజమూరు జట్టు



ట్రోఫీతో వింజమూరు జట్టు

వింజమూరు: స్థానిక ఎంఎస్సార్ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో జిల్లాస్థాయిలో ఎంఎఫ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వింజమూరు జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో గొట్టిగుండాల–2 జట్టుపై వింజమూరు జట్టు విజయం సాధించింది. మొత్తం 38 జట్లు తలపడ్డాయి. ప్రథమ స్థానంలో నిలిచిన వింజమూరు జట్టుకు రూ.50,116, ద్వితీయ స్థానంలో నిలిచిన గొట్టిగుండాల–2 జట్టుకు రూ.30,116, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన మస్తాన్‌కు రూ.5,116 నగదు బహుమతులు అందించారు. నిర్వాహకులు సూరం మహీధర్‌రెడ్డి, పీఈటీ వి.కృష్ణ, బి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.